
నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 19 జూన్ 2024 | HYDERABAD

ఉప్పల్ క్రికెట్ స్టేడియం చెల్లించాల్సిన విద్యుత్ బిల్లుల బకాయిలను చెక్కు రూపంలో సీఎండీకి అందజేస్తున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు



మంగళవారం ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడంతో ఎల్బీనగర్ బస్టాప్‌లో నరకయాతన అనుభవిస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు

## విద్యుత్ బకాయిల చెల్లింపు

### ఉప్పల్ స్టేడియం బిల్లులు చెల్లించిన హెచ్‌సీఏ

### పదేళ్ల విద్యుత్ సమస్యకు పరిష్కారం

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ఉప్పల్ క్రికెట్ స్టేడియం చెల్లించాల్సిన విద్యుత్ బిల్లుల బకాయిలను మంగళవారం చెల్లించింది. ఖైరతాబాద్‌లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) కార్పొరేట్ కార్యాలయంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు మొత్తం బిల్లు రూ.1,48,94,521లను చెక్కు రూపంలో సీఎండీ ముషారఫ్ ఫరూఖీకి అందజేశారు. 2015లో ఈ వివాదం మొదలైంది. ఐపీఎల్ క్రికెట్ జరుగుతున్న సమయంలో రూ.15 లక్షలు చెల్లించామని మిగిలిన మొత్తం 4 నుంచి 5 వాయిదాల్లో చెల్లిద్దామని ఆలోచన చేసినా హెచ్‌సీఏ పేరు ప్రతిష్టలను దృష్టిలో ఉంచుకొని ఒకేసారి అంతా చెల్లించామని చెప్పారు. ఐపీఎల్ క్రికెట్ జరుగుతున్న సమయంలో విద్యుత్ బిల్లు పెండింగ్‌లో ఉందనే కారణంతో క్రికెటర్లు ప్రాక్టీసు చేస్తుండగా కరెంట్ కట్ చేసి, హైదరాబాద్, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఎండీని జగన్‌మోహన్‌రావు కోరారు. పదేండ్ల కింద మొదలైన ఈ సమస్యకు తమను బాధ్యులను చేస్తూ, ఐపీఎల్ జరుగుతున్న సమయంలో కొందరు అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడంతో పాటు జాతీయ స్థాయిలో ఈ విషయం సంచలనమైందని, ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.





నగరంలో పలు ట్రాఫిక్ ఐలాండ్‌ల సుందరీకరణలో భాగంగా కూకట్‌పల్లిలోని కైత్లాపూర్ ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేసిన చిత్రం



యోగా వాక్‌ను ప్రారంభిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

## యోగా దినోత్సవంలో భాగస్వాములు కావాలి

### మంత్రి దామోదర రాజనర్సింహ

ఖైరతాబాద్, జూన్ 18 : ప్రపంచ వ్యాప్తంగా ఈ నెల 21న యోగా దినోత్సవం జరుగుతుందని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. మంగళవారం నెక్లెస్‌రోడ్‌లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా వాక్‌ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. యోగాతో శారీరకంగా మానసికంగా ఆధ్యాత్మికంగా ఆరోగ్య సమతుల్యత ఏర్పడుతుందన్నారు. 21న యోగా దినోత్సవాన్ని ప్రతి పాఠశాల, కళాశాలల్లో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆయుష్ విభాగం కమిషనర్ ప్రశాంతి, డైరెక్టర్ పాణికిరణ్, ప్రకృతి, హోమియో వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.





# ఫొటోలు కొట్టు.. చలాన్లు పెంచు

### ప్రజా పాలనలో గాలి కొదిలేసిన ట్రాఫిక్ నియంత్రణ

### ఐదు నెలల్లో 27.16 శాతం పెరిగిన ఉల్లంఘనలు

### రోడ్డుపై పాదచారులు నడువాలంటే గగనమే

### అటకెక్కిన రోప్.. పెరిగిన సౌండ్ పొల్యూషన్

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): రోడ్లపై ట్రాఫిక్ ఎలా ఉంటే మాకేంటీ?..ఫొటోలు కొట్టాలి.. ఆదాయాన్ని పెంచాలి.. ఖజానా నింపే ధోరణితో ప్రజాపాలనలో ట్రాఫిక్ నియంత్రణను ట్రాఫిక్ పోలీసులు గాలికొదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్‌లు.. ఫుట్‌పాత్ ఆక్రమణలు.. రోడ్లపై పాదచారులు నడిచేందుకు వీలు లేని పరిస్థితి. హెల్మెట్ లేకుండా ప్రయాణాలు, సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ ఇలా ఎన్నో ట్రాఫిక్ ఉల్లంఘనలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఆపరేషన్ రోప్(రిమూవల్ ఆబ్‌స్ట్రక్టివ్ పార్కింగ్ అండ్ ఎంక్రోచ్‌మెంట్) అటకెక్కింది. 2023 జనవరి 1 నుంచి మే, 27, 2023, 2024 జనవరి 1 నుంచి మే, 27 ఐదు నెలల సమయానికి 55 రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలు పోలిస్తే 27.16 శాతం పెరిగాయి. ట్రాఫిక్ ఇబ్బంది కల్గించేవి, రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే ప్రధానమైన ఉల్లంఘనలో రోడ్లపై ఎక్కడి పడితే అక్కడ పార్కింగ్ చేస్తున్న కేసులు 98 శాతం పెరుగగా, పాదచారులను ఇబ్బందులు పెట్టే కేసులు 258 శాతం, సైలెన్సర్స్‌తో సౌండ్ పొల్యూషన్ కేసులు 400 శాతం పెరిగాయి. కేవలం ట్రాఫిక్ పోలీసులు ఫొటోలు కొట్టి చలాన్లు వేయడమే తమ విధులు అన్నట్లుగా పనిచేస్తున్నారు. దీంతో నగరంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తమవుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ వైపు ప్రజల్లో అవగాహన పెంచుతూ, మరో వైపు ఉల్లంఘనదారులపై చలాన్లు వేసే వారు. ఇప్పుడు అవగాహన కార్యక్రమాలు లేవు, పట్టించుకునే నాథుడు లేడు. అయితే ఇప్పుడు చాలా వరకు నాన్ కాంటాక్టు పద్ధతిలోనే చలానాలు వేస్తున్నారు.

#### పోటీ పడి ఫొటోలు..!

ఆరు నెలలుగా ట్రాఫిక్ వ్యవస్థను గాడిలో పెట్టలేని పరిస్థితి. ట్రాఫిక్‌లో పనిచేసే పోలీసులు ఉన్నతాధికారులు ఎప్పుడో ఓ సారి హడావిడి చేయగానే రోడ్లపై కన్పిస్తుంటారు. ఆ తరువాత అడిగేవారే ఉండరు. కాని ప్రతి రోజు ఆయా పోలీస్‌స్టేషన్ల నుంచి ఎన్ని ఉల్లంఘన కేసులు నమోదయ్యాయనే విషయంపై ఉదయం అధికారులకు లిస్ట్ వెళ్తుంది. అలా చలాన్లు పెరుగుతుండటంతో కొందరు అధికారులు అంతకే సంతృప్తి చెందుతున్నారా? ఎందుకు ఉల్లంఘనలు పెరుగుతున్నాయి? అనే విషయంపై ఆరా తీస్తున్నారా? అనే విషయాలపై అధికారులు సమాలోచన చేయాల్సిన అవసరముంది. చలాన్లు వేయడమే పరమావధిగా నేడు పోలీసులు పనిచేస్తున్నారు.. కేవలం ఐదు నెలల సమయంలో 27 శాతం ఉల్లంఘనలు పెరిగాయంటే, ట్రాఫిక్ నియంత్రణను గాలికి వదిలేశారు. గత ఆరు నెలల క్రితం వరకు ఆపరేషన్ రోప్ కొనసాగింది. ట్రాఫిక్ విభాగంతో సామాన్య ప్రజలకు 100 శాతం సంబంధముంటుంది, ట్రాఫిక్ ఎలాంటి ఇబ్బంది కల్గకుండా సాఫీగా ప్రయాణం సాగేలా చర్యలు తీసుకోవడంపై దృష్టి పెట్టి జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ, విద్యుత్, వాటర్‌వర్క్స్ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ పనిచేశారు. ఒక పక్క అవగాహన తెచ్చి మరో పక్క ఉల్లంఘనదారులపై చర్యలు తీసుకుంటూ మంచి ఫలితాలు సాధించారు. అయితే ఇప్పుడు ఆ విషయంపై పట్టించుకునే వారు లేరు. నగర ట్రాఫిక్ విభాగంలో పనిచేసే బాస్‌లు తరుచు మారుతుండటం కూడా ఒక సమస్యగా మారిందనే వాదన విన్పిస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉంది.

| కొన్ని ఉల్లంఘనలు | 2023 జనవరి 1 నుంచి మే 27, 2023 | 2024 జనవరి 1 నుంచి మే, 27 | తేడా | పెరుగుదల (శాతం) |
|---|---|---|---|---|
| హెల్మెట్ లేని వారు | 9,40,670 | 11,46,698 | 2,06,028 | 21.9 |
| సర్వీస్‌రోడ్డులో పార్కింగ్ | 84,191 | 1,16,815 | 32,624 | 38.75 |
| రాంగ్ పార్కింగ్ క్యారేజ్ వే | 77,212 | 1,05,504 | 28,292 | 36.64 |
| రాంగ్/అనాథరైజ్డ్ పార్కింగ్ | 25, 469 | 49,117 | 23,648 | 92.85 |
| డేంజరెస్ డ్రైవింగ్ | 35, 547 | 35, 954 | 1407 | 4.07 |
| సిగ్నల్ జంపింగ్ | 31,133 | 34,181 | 3,048 | 9.79 |
| సెల్‌ఫోన్ డ్రైవింగ్ | 27,392 | 31,711 | 4,319 | 15.77 |
| డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా | 18,776 | 28,327 | 9,551 | 50.87 |
| డ్రంక్ అండ్ డ్రైవింగ్ | 16,791 | 26,202 | 9,411 | 56.05 |
| పాదచారులకు ఇబ్బంది కల్గించేవి | 1,670 | 5,982 | 4,312 | 258.2 |
| సైలెన్సర్స్‌తో సౌండ్ పొల్యూషన్ | 1,053 | 6,110 | 5,057 | 480.25 |

# అగ్గువకే బంగారం ఇస్తామని

### ఘరానా ముఠా అరెస్ట్.. రూ. 51 లక్షల నగదు

### రూ. 6 కోట్ల నకిలీ నోట్లు, 5 కిలోల నకిలీ బంగారం స్వాధీనం

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): కస్టమ్స్ నుంచి కొనుగోలు చేసిన బంగారాన్ని తక్కువ ధరకు విక్రయిస్తున్నామని నమ్మించి వ్యాపారులకు కోట్ల రూపాయలు కుచ్చు టోపీ పెడుతున్న ముఠాను మేడిపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుంచి రూ.51 లక్షల నగదు, రూ. 6.86 కోట్ల నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా వివరాలను మంగళవారం నేరెడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ తరుణ్‌జోషి వెల్లడించారు. నెల్లూర్ జిల్లా కావలికి చెంది కర్రెద్దుల విజయ్‌కుమార్ బీటెక్ పూర్తి చేశాడు. తక్కువ ధరకు బంగారం విక్రయిస్తున్నామంటూ తమ ఊరిలో జరిగిన ఒక మోసం గూర్చి తెలుసుకొని తాను కూడా అలాగే మోసాలు చేయాలని ప్లాన్ చేశాడు. ఇందుకు తన స్వస్థలానికి చెందిన వృత్తిరీత్యా డ్రైవర్లైన బోగిరి సునీల్ గవాస్కర్ అలియాస్ హరీశ్, అడిగోపుల ఓమ్ సాయి కిరీటి, తెనాలికి చెందిన వ్యాపారి నంబూరి డేవిడ్ లివింగ్‌స్టోన్ అలియాస్ సెంథిల్‌తో ఒక ముఠాను ఏర్పాటు చేశారు. ప్రధాన నిందితుడైన విజయ్‌కుమార్‌పై కావలిలో 13 చీటింగ్ కేసులు, సెంథిల్‌పై రెండు కేసులు నమోదయ్యాయి, వీళ్లకు స్థానిక పోలీసులు ఘాటైన వార్నింగ్ ఇవ్వడంతో తమ మకాంను బెంగళూర్‌కు మార్చారు.

#### నకిలీ బంగారాన్ని అంటకట్టి.. పోలీస్‌లా దాడి!

విజయ్‌కుమార్, డేవిడ్ లైవింగ్ స్టోన్ వ్యాపారుల వద్దకు వెళ్లి తక్కువ ధరకు బంగారం ఉందని సంప్రదిస్తారు. తమ వద్ద ఉండే అసలైన 5 తులాల బంగారాన్ని రూ. 2 లక్షలకే విక్రయించి వ్యాపారుల నమ్మకాన్ని పొందుతారు. మేం కస్టమ్స్ నుంచి తక్కువ ధరకు బంగారాన్ని కొంటాం, మీకు కావాలంటే వారం రోజుల్లో కిలో, రెండు కిలోలు అందివ్వగలమంటూ నమ్మిస్తారు. వీళ్ల మాటలు నమ్మిన వ్యాపారులు అందుకు కొంత అడ్వాన్స్ ఇచ్చి పంపిస్తారు. బంగారాన్ని మాత్రం బెంగళూర్, చెన్నైలో అందిస్తామంటూ నమ్మిస్తారు. అడ్వాన్స్ తీసుకున్న వాళ్లు బెంగళూర్‌కు వెళ్లిన సమయంలో మీ బంగారం రావడానికి ఇంకా వారం పడుతుందని, తక్కువ ధరకు మాట్లాడుకున్నట్లుగా పూర్తి మొత్తాన్ని ఇవ్వాలని చెబుతారు. ఆ సమయంలోనే బోగిరి సునీల్ గవాస్కర్ అక్కడ హడావిడి చేస్తుంటాడు. మీకు మొత్తం డబ్బు ఇస్తున్నామంటూ నకిలీ నోట్ల కట్టలను అందజేసి కస్టమర్‌లా నటిస్తుంటాడు. అక్కడ భారీ ఎత్తున బంగారం వ్యాపారం నడుస్తుందనే బిల్డప్ ఇస్తారు. చెప్పినట్లు కొన్ని రోజుల తరువాత అక్కడకు వెళ్లి బంగారం తీసుకుంటాడు. అయితే అతనికి అసలైన బంగారం ప్యాక్ చేసే కవర్లలోనే నకిలీ బంగారం ప్యాక్ చేసి, మొత్తం డబ్బులు తీసుకొని పంపిస్తారు. కొద్ది దూరం వెళ్లగానే పోలీసు దుస్తుల్లో ఓమ్‌సాయి కిరిటీ వచ్చి వారిని ఆపి వాహనాన్ని తనిఖీ చేస్తారు, అక్రమ దందా చేస్తున్నారని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తీసికెళ్లండంటూ ఆ నకిలీ బంగారాన్ని తీసుకొని అక్కడి నుంచి ఉడాయిస్తాడు. ఇలా వ్యాపారులను మోసం చేస్తున్నారు.





స్వాధీనం చేసుకున్న నకిలీ గోల్డ్ బిస్కెట్లను చూపిస్తున్న రాచకొండ సీపీ తరుణ్‌జోషి

#### నగరవాసికి రూ.1.1 కోట్లు.. టోకరా

బోడుప్పల్‌కు చెందిన శ్రీ దిలీప్ బార్ఫ వృత్తిరీత్యా వ్యాపారి. తన స్నేహితుడు సింగిరెడ్డి సురేశ్‌కు వచ్చిన సమాచారంతో మే 19న బెంగళూర్, టీసీ పాల్యకు వెళ్లి అక్కడ విజయ్‌కుమార్, సునీల్ గవాస్కర్‌ను కలిశారు. రూ. 6 లక్షలు తీసుకొని 101 గ్రాముల బంగారం ఇచ్చారు. దీంతో దిలీప్‌కు నమ్మకం కుదిరి 2 కిలోల బంగారం కోసం మొదట రూ. 20 లక్షలు అడ్వాన్స్ ఇచ్చారు. వారం రోజుల తరువాత బెంగళూర్‌కు వెళ్లి విజయ్‌కుమార్‌ను కలిశారు. ఆ సమయంలో 5 కిలోల బంగారం విక్రయిస్తున్నట్లు, కొన్నవాళ్లు డబ్బులు ఇస్తున్నట్లు అంతా నకిలీ బంగారం, నకిలీ నోట్లతో నాటకం చేశారు. ఈ నాటకం చూసి బాధితుడు నిజమని నమ్మాడు. దీంతో మిగతా రూ. 90 లక్షలు కూడా చెల్లించారు. మీ స్టాక్ ఇంకా రాలేదు, మా మేనేజర్‌ను కలుద్దామంటూ చెన్నైకి తీసుకెళ్లి రాయల్ మెరిడియన్ హోటల్‌లో గదిని తీసుకున్నారు. సెంథిల్‌ను కల్పించారు, అయితే మీ బంగారం బంజారాహిల్స్‌లోని రోడ్డు నం.35లో మీరు కలెక్ట్ చేసుకోండి అంటూ అతడు సూచించాడు. ఆ తరువాత అక్కడి నుంచి బాధితుడు రాగానే ఈ ముఠా సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. ఆ తరువాత సెల్‌ఫోన్ ఆన్‌లో ఉన్నా ఫోన్లు లిఫ్టు చేయకపోవడంతో అనుమానం వచ్చి మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఈ ముఠాను పట్టుకొని విచారించి వివరాలు వెల్లడించారు. నిందితుల నుంచి రూ. 51 లక్షల అసలు నగదు, ఒక పోలీస్ కానిస్టేబుల్ యూనిఫామ్, మూడు ఖరీదైన కార్లు, రూ. 6.86 కోట్ల నకిలీ నోట్ల కట్టలు, 5 కిలోల నకిలీ బంగారం బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఎస్ఓటీ డీసీపీ మురళీధర్, మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యూసుఫ్‌గూడ డీసీ సేవా ఇస్లావత్‌కు రెప్రజెంటేషన్‌పై ఎండార్స్‌మెంట్ లెటర్ అందిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

## 'సమస్యలపై శంఖారావం'

### ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జూబ్లీహిల్స్,జూన్18 : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'సమస్యలపై శంఖారావం' కార్యక్రమాన్ని చేపడుతున్నామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేర్కొన్నారు. సమస్యల రహిత డివిజన్లుగా తీర్చిదిద్దేందుకు బస్తీలు, కాలనీల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటారని తెలిపారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ అధ్యక్షతన కమలాపురి కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయ ప్రాంగణంలో సమస్యలపై శంఖారావం కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి రోజు యూసుఫ్‌గూడ, శ్రీనగర్ కాలనీ డివిజన్‌ల సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

## ఎలివేటెడ్ కారిడార్లలో భూసేకరణకు ₹2300 కోట్లు

### క్షేత్ర స్థాయిలో మార్కింగ్

### ప్రక్రియను పూర్తి చేసిన హెచ్‌ఎండీఏ

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరం నుంచి ఉత్తర తెలంగాణ వైపు నిర్మించ తలపెట్టిన రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక పనులు కొనసాగుతున్నాయి. సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ నుంచి తూంకుంట వరకు రాజీవ్ రహదారిపై, ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి మిలిటరీ డెయిరీ ఫామ్ వరకు నిర్మించే రెండు ఎలివేటెడ్ కారిడార్ల కోసం అవసరమైన స్థలాలను గుర్తించడంతో పాటు మార్కింగ్ పనులను పూర్తి చేశారు. రెండు ఎలివేటెడ్ కారిడార్లలో రక్షణ శాఖకు చెందిన భూములు ఉండటంతో వేర్వేరుగా, మిగతా భూములు ప్రజలకు చెందిన వాటిని గుర్తించారు. ఈ రెండు కారిడార్‌లలో కలిపి మొత్తం రూ.2300 కోట్ల వరకు ఆస్తుల సేకరణకే వ్యయం అవుతుందని హెచ్‌ఎండీఏ అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. ఇందులో సుమారు రూ.300 కోట్ల వరకు రక్షణ శాఖకు సంబంధించిన భూముల కోసం చెల్లించాల్సి ఉంటుంది. కాగా ప్రైవేటు ఆస్తుల సేకరణకు చెల్లించాల్సిన మొత్తాన్ని టీడీఆర్ లేదా నగదు రూపంలో ఇవ్వాల్సి ఉంటుందని, రెండు మార్గాల్లో మొత్తం ఆస్తుల గుర్తింపు పూర్తి చేసిన తర్వాత నోటీసులు జారీ చేస్తామని ఓ అధికారి తెలిపారు.



ముషీరాబాద్, జూన్ 18: నిఖార్సైన విద్యార్థి ఉద్యమ నాయకుడు వంగపల్లి శ్రీనివాస్ అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ తన పుట్టినరోజు సందర్భంగా మంగళ వారం హరీశ్‌రావును కలిశారు. వంగపల్లికి హరీశ్‌రావుతో పాటు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పి.రమేశ్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు యాతాకుల భాస్కర్, కోర్ కమిటీ సభ్యుడు బంగారు శ్రీనివాస్ పాల్గొన్నారు.